



APTEL/2015/65279

# V న్యూస్

మన ఊరు - మన వార్తలు

తెలుగు దినపత్రిక

e-mail : vnewsmachilipatnam@gmail.com
e-mail : vnewsindia@gmail.com

Postal Reg.No. MPM/L22/VNEWS/19-21


## ఏపీలో మరో 67 పాజిటివ్ కేసులు

**(విన్యూస్, అమరావతి) :** ఏపీలో కరోనా మహమ్మారి విజృంభిస్తోంది. గడిచిన 24 గంటల్లో కొత్తగా 67 పాజిటివ్ కేసులు నమోదైనట్లు వైద్య ఆరోగ్య శాఖ తాజా బులిటెన్‌లో వెల్లడించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం కేసుల సంఖ్య 1717కి చేరింది. ఇప్పటి వరకూ 589 మంది కోలుకుని డిశ్చార్జి కాగా.. 34 మంది మృతి చెందారు. ప్రస్తుతం వివిధ ఆస్పత్రుల్లో 1094 మంది చికిత్స పొందుతున్నారు. ఇవాళ నమోదైన కేసుల్లో అత్యధికంగా కర్నూలులో 25 కేసులు ఉన్నాయి. దీంతో ఇక్కడ మొత్తం కేసుల సంఖ్య 516కు చేరుకున్నాయి. రాష్ట్రంలో గత 24 గంటల్లో 8,263 శాంపిల్స్ పరీక్షించినట్లు అధికారులు తెలిపారు. ఇవాళ్టి 67 పాజిటివ్ కేసుల్లో గుజరాత్ నుంచి వచ్చిన 14 మంది ఉన్నారు.


సంపుటి : 6 సంచిక : 299 మచిలీపట్నం, విజయవాడ, కాకినాడ, గుంటూరు, ఖమ్మం, వైఎస్ఆర్ కడప, ఒంగోలు, పొట్టి శ్రీరాములు నెల్లూరు 06-05-2020 బుధవారం పేజీలు :4 వెల : రూ.3/-


## మద్యం షాపులవద్ద ఉపాధ్యాయులా?:చంద్రబాబు



**(విన్యూస్, అమరావతి) :** మద్యం వల్ల హింసాత్మక చర్యలు పెరుగుతున్నాయని తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దక్షిణాదిలో ఎక్కడా మద్యం దుకాణాలు తెరవకపోయినా ఏపీలో మాత్రం విచ్చలవిడిగా మద్యం దుకాణాలు ఓపెన్ చేశారని విమర్శించారు. మద్యం దుకాణాలను పోలీసులతో నియంత్రిస్తారా?.. చదువు చెప్పాల్సిన ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద పెడతారా అని ప్రశ్నించారు. రెడ్ జోన్లలో కనీసం మాస్కులు కూడా ఇవ్వలేకపోయారని విమర్శించారు.

" 130 కోట్ల మంది ప్రజలు లాక్‌డౌన్ నిబంధనలు స్వచ్ఛందంగా పాటించారు. రాష్ట్రంలో రెడ్‌జోన్‌లో 5, ఆరెంజ్ జోన్‌లో 7, గ్రీన్ జోన్‌లో ఒక జిల్లా ఉంది. దేశంలో నిన్న ఒక్కరోజే 3,932 కరోనా కేసులు నమోదయ్యాయి. క్రమశిక్షణగా ఉండి మనల్ని మనం కాపాడుకోవాలి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా పరిస్థితి మన చేతుల్లో ఉండదు. మద్యం దుకాణాలు వద్దని కొన్ని చోట్ల మహిళలు ఆందోళన చేశారు. మద్యం వల్ల హింసాత్మక చర్యలు పెరుగుతున్నాయి. కొన్ని చోట్ల హత్యలు, ఆత్మహత్యలు జరిగాయి. మీ నిర్ణయం వల్ల ఆరుగురు చనిపోయారు. రాష్ట్రంలో కరోనాను ఎలా కట్టడి చేస్తారో చెప్పాలి" అని చంద్రబాబు డిమాండ్ చేశారు.

## అనధికార మద్యం విక్రయాల విభేదాల్లో వ్యక్తి మృతి?

### -పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన కు దిగిన కుటుంబీకులు

### -ఎం.ఎల్‌ఏ హామీతో ఆందోళన విరమణ



**(విన్యూస్, కూచిపూడి) :** అనధికార మద్యం విక్రయాలు వివాదం వాచ్ మెన్ మృతికి కారణమైన సంఘటన మంగళవారం కూచిపూడి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది.అక్రమ మద్యం రవాణాకు అడ్డుపడుతున్నాడనే కారణం తో కోటేశ్వరరావు ను షాపులోని తోటి ఉద్యోగులు హతమార్చినట్లు మృతుని కుటుంబీకులు కూచిపూడి పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించారు. మంగళవారం ఉదయం6గంటలకు ప్రారంభమైన ఈ ఆందోళన



కార్యక్రమంలో మృతుని కుటుంబీకులు మాట్లాడుతూ తనపై దాడి జరిగిననేపథ్యం లో ఫిర్యాదు చేసినప్పటికీ స్థానిక ఎక్సయిజ్ శాఖ గాని పోలీసు శాఖ గాని స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు.సోమవారం రాత్రి 7 గంటలకు షాపును మూసివేయడం తో అదే షాపులో సేల్స్ మెన్ క్యాషియర్ లుగా విధులు నిర్వర్తిస్తున్న జున్ను రాజేష్ బెజవాడ రాజేష్ లమద్యం సేవించి మృతుడితో సైతం బలవంతంగా మద్యం త్రాగించి తీవ్రంగా కొట్టడంతో స్థానికుల సహాయం తో కోటేశ్వరరావు కూచిపూడి పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసి నప్పటికీ చర్యలు తీసుకోలేదని తీవ్ర గాయాలతో కోటేశ్వరరావు మృతి చెందడ%శీ% జరిగిందని మృతుని కుటుంబీకులు మీడియా కు తెలిపారు.

. కోటేశ్వరరావు మృతి కి కారణమైన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, దళితవ్యక్తి హత్యకు గురైన ఇదే నియోజక వర్గ ఎమ్మెల్యే తమకు న్యాయం చేయాలనిదోషులు కఠినంగా శిక్షింపబడాలని కోరుతూ స్టేషన్ ముందుగల 216 జాతీయరహదారిపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు.వీరి ఆందోళన ఉధృతం గావడం రహదారిపై అత్యవసర వాహనాలు సైతం నిలిచిపోవడం వంటి కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్న తరుణంలో ఎట్టకేలకు స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ విచ్చేసి బాధిత కుటుంబీకుల ను పరామర్శించి వివరాలు ఆడిగితెలుసుకున్నారు.అలాగే కేసుపురోగతి పోలీసు అధికారుల ద్వారా వివరాలు తెలుసుకున్నారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధికోసం మద్యం షాపులో విధులు నిర్వర్తిస్తూ ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని జరిగిన సంఘటనపై నిష్పక్షపాతంగా దర్యాప్తు జరుగుతుందని మృతుని కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని బాధిత కుటుంబాల హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అవనిగడ్డ డిఎస్పీ రమేష్ రెడ్డి తోపాటు చల్లపల్లి సి ఐ వెంక ట నారాయణ చల్లపల్లి ఘంటసాల స్టేషన్ ల ఎస్ ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

కాగా మృతుడు కోటేశ్వరరావు తనపై దాడి జరిగినట్లు గా ఫిర్యాదు చేయగా సోమవారం రాత్రి కేసు నమోదు చేసి దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు,ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకోబడతాయని ఎస్ ఐ హాబీబ్ బాషా తెలిపారు.

వివాదానికి కారణం అనధికార విక్రయ మద్యం కారణంగా తెలుస్తున్నది.స్థానిక అధికారుల నిర్లక్ష్యం కారణంగా నే అక్రమ మద్యం విక్రయాలు జరిగినట్లు తెలుస్తున్నది. జనతా కర్ఫ్యూ తో పాటు కొనసాగిన లాక్డ్ డౌన్ కాలంలో కూడా అనధికార విక్రయాలు కొనసాగినట్లు తెలుస్తున్నది.లాక్డ్ డౌన్ నేపథ్యంలో ఒక్కో మద్యం బాటిల్ పై 2రేట్లు అదనపు ధరలకు విక్రయాలు కొనసాగినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక ఎక్సయిజ్ పోలీసు శాఖల నిర్లక్ష్యం కారణంగా యథేచ్ఛగా విక్రయాలు కొనసాగినట్లు ఆవివాదాల కారణంగానే షాపులోని స్థాక్ లో హెచ్చుతగ్గుల కారణంగా వివాదం ముదిరి హత్యకు దారితీసినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి . ఇప్పటికైనా మద్యం విక్రయాల పట్ల అధికారులు ప్రభుత్వ నిబంధనల కనుగుణంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఇతర రాష్ట్రాలకంటే భిన్నంగా పనిచేశాం:జగన్



**(విన్యూస్, అమరావతి) :** కరోనా వైరస్‌ను ఎదుర్కొనే విషయంలో ఇతర రాష్ట్రాల కంటే భిన్నంగా పనిచేయగలిగామని ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. కొవిడ్ పరీక్షల పరంగా చూస్తే దేశంలోనే ఏపీ మొదటి స్థానంలో ఉందని.. ప్రతి 10లక్షల జనాభాకు 2500కి పైగా పరీక్షలు చేస్తున్నామని, ఇది ఒక రికార్డు అని చెప్పారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కరోనా నివారణ చర్యలతో పాటు ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయం, తాగునీరు, నాడు–నేడు, గృహనిర్మాణం, ఉపాధి హామీ అంశాలపై జగన్ సమీక్ష నిర్వహించారు. కరోనా నియంత్రణ విషయంలో కలెక్టర్లు, ఎస్పీలు చక్కటి పనితీరు కనబరిచారని సీఎం అభినందించారు. 35రోజుల క్రితం రాష్ట్రంలో తిరుపతి స్విమ్స్ తప్ప మరెక్కడా కరోనా పరీక్షలు చేసే సౌకర్యం లేదని.. అక్కడ కూడా రెండు రోజుల తర్వాత ఫలితాలు వచ్చేవని జగన్ గుర్తు చేశారు. ప్రస్తుతం 11 జిల్లాల్లో పరీక్షలు చేసే ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ట్రూనాట్ కిట్లు సైతం అన్ని ఆస్పత్రుల్లో ఉన్నాయని వివరించారు. గ్రామ వాలంటీర్లు, ఆశా వర్కర్ల రూపంలో మనకు బలమైన నెట్‌వర్క్ ఉందన్నారు. కరోనాను ఎంత కట్టడి చేయాలనుకుంటున్నా.. అది ఎక్కడో ఓ చోట కనిపిస్తోందన్నారు. కరోనా జీవితంలో భాగమని.. దానితో కలిసి జీవించాల్సి ఉంటుందని సీఎం పునరుద్ఘాటించారు. కరోనా మరణాల రేటు కేవలం 2 శాతంలోపే ఉందన్నారు. వయసు పైబడిన వారు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారిపైనే ఇది ప్రభావం చూపుతోందని చెప్పారు.

### కనీసం లక్ష మందికి క్వారంటైన్ సదుపాయం కల్పించాలి

ఇతర రాష్ట్రాల్లో ఉన్న వలస కార్మికులు ఏపీకి తిరిగి వస్తున్నారని.. వాళ్లకు క్వారంటైన్ సదుపాయాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని సీఎం జగన్ చెప్పారు. లక్షకు పైగా వలస కూలీలు, మరో లక్ష మంది ఇతరులు కూడా వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. వివిధ దేశాల నుంచి కూడా మన రాష్ట్రానికి చెందిన వారు వస్తున్నారని.. అందుకే స్థిరంగా ప్రభుత్వం తరఫున కొన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. దాదాపు 11 వేలకు పైగా ఉన్న గ్రామ సచివాలయాల్లో కనీసం లక్ష మందికి క్వారంటైన్ సదుపాయాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని సీఎం చెప్పారు. ప్రస్తుతం ఉన్న క్వారంటైన్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలపై ఎప్పటికప్పుడు సమీక్ష చేయాలన్నారు. ఆయా కేంద్రాల్లో సదుపాయాలపై రోజూ సమీక్ష నిర్వహించాలని జిల్లా కలెక్టర్లను సీఎం ఆదేశించారు. పీహెచ్‌సీ పరిధిలో ఒక ద్విచక్ర వాహనాన్ని, థర్మల్ బాక్సును అందుబాటులోకి తీసుకురావాలని జగన్ సూచించారు. 24 గంటల్లోపు ప్రిస్క్రిప్షన్ ప్రకారం మందులు సరఫరా చేయాలన్నారు. త్వరలో విలేజ్ క్లినిక్ ప్రారంభమవుతుందని.. అప్పుడు టెలీ మెడిసిన్ మరింత బలోపేతమవుతుందని చెప్పారు. ఈ వ్యవస్థను కలెక్టర్లు తమది భావించి బాగా పనిచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్దేశించుకున్న కంటైన్‌మెంట్ క్లస్టర్లపై దృష్టి పెట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. అనంతరం ఖరీఫ్ సీజన్ వ్యవసాయంపై జగన్ సమీక్ష నిర్వహించారు.

### ఆర్బీకేలకు సలహాల కోసం అడ్వైజరీ బోర్డులు

జూన్ 1 నుంచి రైతు భరోసా కేంద్రాలు(ఆర్బీకే) ప్రారంభమవుతాయని సీఎం జగన్ స్పష్టం చేశారు. ఈలోపు మండల, జిల్లా స్థాయి అడ్వైజరీ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ అడ్వైజరీ బోర్డులు సలహాలు, సూచనలు చేస్తాయన్నారు. ఏ పంట వేయాలి? ఏ పంటలు వేస్తే మంచి ధర వస్తుంది? అనే విషయాలపై ఆయా బోర్డులు తమ సలహాలు ఇస్తాయని సీఎం చెప్పారు. ఈ సూచనల మీద రైతులకు అవగాహన కల్పించడంతో పాటు అవి అమలయ్యేలా ఆర్బీకేలు చర్యలు చేపడతాయన్నారు. మనిషికి గుండె ఎలాంటిదో వ్యవసాయ రంగానికి ఆర్బీకేలు కూడా అలానే పనిచేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల బాధ్యతలు కూడా ఆర్బీకేలే తీసుకుంటాయన్నారు. వాటిని ముందుండి నడిపించాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లదేనని స్పష్టం చేశారు. మరో ఏడాదిలోపు జనతా బజార్లు వస్తాయని సీఎం వివరించారు.

### రైతులకు అక్టోబరు నాటికి డెబిట్ కార్డులు

ప్రభుత్వం అందించే నగదు రైతులకు చేరేందుకు డెబిట్ కార్డులు ఇస్తామని.. వచ్చే అక్టోబరు నాటికి వారికి ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని జగన్ స్పష్టం చేశారు. రైతులు ఆ కార్డుతో డబ్బైనా తీసుకోవచ్చుని.. లేదంటే దాని ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసుకోవచ్చన్నారు. దీంతో పాటు క్రెడిట్ కార్డులు కూడా ఇవ్వాలని భావిస్తున్నామన్నారు. రైతు పంట వేసిన తర్వాత పంట రుణం రాలేదన్న మాట వినకూడదనే ప్రభుత్వం ఈ ప్రయత్నాలు చేస్తోందన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో ఉన్న అగ్రికల్చర్ అసిస్టెంట్ ఇ–క్రాపింగ్ చేస్తారని చెప్పారు. దీని ఆధారంగా బ్యాంకు కచ్చితంగా రైతులకు రుణాలు ఇవ్వాలన్నారు. ఆ రుణంపై వైఎస్ఆర్ సున్నా వడ్డీ కింద జీరో వడ్డీ వర్తిస్తుందని సీఎం వివరించారు. ప్రస్తుతం ఏపీపై తుపాను ప్రభావం లేకపోవచ్చని ఐఎండీ చెబుతోందన్నారు. కాకపోతే అకాల వర్షాలు కురిసే అవకాశముందని.. ఈ నేపథ్యంలో రైతులు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు జగన్ సూచించారు.

### జిల్లాకు ముగ్గురు జేసీలు

ప్రతి జిల్లాకూ ముగ్గురు జేసీలను పెడుతూ ఉత్తర్వులు జారీ చేస్తామని సీఎం చెప్పారు. ఎవరెవరూ ఏం చేయాలనేదానిపై విధివిధానాలు రూపొందిస్తామన్నారు. ఒక జేసీకి పూర్తిగా వ్యవసాయానికి సంబంధించిన బాధ్యతలు అప్పగిస్తామని చెప్పారు. ప్రభుత్వ ప్రాధానాంశమైన నాడు–నేడు, ఆస్పత్రులు, స్కూళ్ల అభివృద్ధి బాధ్యతలు వీరికి అప్పగిస్తామన్నారు. గ్రామ సచివాలయాల్లో నిర్దేశించిన సమయంలోపు పలానా సర్వీసులు అందిస్తామని చెప్పామని.. నిర్ణీత సమయంలోపు అవి ప్రజలకు అందాలన్నారు. దరఖాస్తు చేసినా రాలేదనే మాట రాకూడదని.. ఆ బాధ్యత కలెక్టర్లదేనని సీఎం స్పష్టం చేశారు.

### షాక్ కొట్టేలా మద్యం రేట్లు

మద్యపానాన్ని నిరుత్సాహపరచడానికి 75 శాతం ధర పెంచామని సీఎం స్పష్టం చేశారు. దుకాణాల సంఖ్య కూడా 13 శాతం తగ్గించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 43వేల బెల్టుషాపులను రద్దుచేశామని జగన్ వివరించారు. మద్యం అమ్మకాలను పెంచేందుకు ప్రైవేటు వ్యక్తులు బెల్టుషాపులను ప్రోత్సహించేవారని.. అందుకే లాభాపేక్ష లేకుండా ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహిస్తోందని చెప్పారు. రేట్లు షాక్ కొట్టించేలా ఉండాలని నిశ్చయించుకున్నామన్నారు. పక్క రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం రవాణాతో పాటు రాష్ట్రంలో మద్యం తయారీని కూడా అడ్డుకోవాల్సి ఉందన్నారు. మద్యం, ఇసుక అక్రమ రవాణాపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు గట్టి ధ్యాస పెట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు.

## నాలుగు రంగులు వద్దు: ఏపీ హైకోర్టు

**(విన్యూస్, అమరావతి) :** ప్రభుత్వ కార్యాలయాలకు నాలుగు రంగులు వేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 623 జీవోను నిలిపివేస్తూ ఏపీ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కార్యాలయాలకు వైకాపా రంగులు తొలగించాలనే హైకోర్టు ఆదేశాల తర్వాత మట్టి రంగు చేరుస్తూ ప్రభుత్వం మరో జీవో జారీ చేసింది. సుప్రీం కోర్టు ఉత్తర్వుకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిందని హైకోర్టులో




మరోసారి పిటిషన్లు దాఖలయ్యాయి. పిటిషన్లపై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం ఈమేరకు ఆదేశాలు చేసింది. కేసు విచారణను ఈనెల 19కి వాయిదా వేసింది.

## స్వదేశానికి భారతీయులు.. కేంద్రం చర్యలు

**(ఢిల్లీ) :** విదేశాల్లో చిక్కుకున్న భారతీయులను తిరిగి స్వదేశానికి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. విదేశాల్లో సుమారు 1.04 కోట్ల మంది భారతీయులు ఉన్నట్లు కేంద్రం అంచనా వేసింది. అయితే కేంద్ర ప్రభుత్వం అందరినీ భారత్‌కు తీసుకువస్తుందా అనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. భారత్‌కు తిరిగి రావడానికి దాదాపు 3 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని.. ప్రయాణానికి చట్టబద్ధమైన కారణాలున్న భారతీయులను మాత్రమే తిరిగి స్వదేశానికి తీసుకురావాలని కేంద్రం నిర్ణయించినట్లు విదేశాంగ శాఖ వర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో విదేశాల్లో ఉన్న భారతీయులను స్వదేశానికి తీసుకొచ్చేందుకు కేంద్ర హోంశాఖ పలు మార్గదర్శకాలు జారీ చేసింది. విదేశాల నుంచి భారత్‌కు రావాలనుకునే వారు వారి ప్రయాణ ఖర్చులు వారే భరించాలని హోంశాఖ సూచించింది. ప్రతిఒక్కరికీ థర్మల్ స్క్రీనింగ్ చేయనున్నట్లు తెలిపింది. విదేశాల నుంచి వచ్చిన ప్రతి ఒక్కరూ 14 రోజులు క్వారంటైన్‌లో ఉండాలని కేంద్ర హోంశాఖ స్పష్టం చేసింది.

నౌకాదళం ఆధ్వర్యంలో 'ఆపరేషన్ సముద్ర'

మాల్దీవుల్లో ఉన్న భారతీయులను తరలించేందుకు భారత నావికా నౌకాదళం 'ఆపరేషన్ సముద్ర'ను ప్రారంభించింది. ఈ క్రమంలో నావికా దళానికి చెందిన 'జలశ్వ', 'మగర్' యుద్ధనౌకలు మాల్దీవులకు బయలుదేరినట్లు అధికారులు తెలిపారు. ఈ రెండు యుద్ధనౌకల్లో సుమారు 1000 మందిని తీసుకొచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. భారతదేశానికి తిరిగి వచ్చే భారతీయుల జాబితాను మాల్దీవుల్లో ఉన్న ఇండియన్ మిషన్ ఇప్పటికే సిద్ధం చేసింది. ఈ నౌకల ద్వారా తరలించే వారికి వైద్య పరీక్షలు, స్క్రీనింగ్ కూడా నిర్వహించనున్నట్లు అధికారులు వివరించారు.

## వైకాపా ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు

**(విన్యూస్, అమరావతి) :** కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు విధించిన లాక్‌డౌన్‌ను ఉల్లంఘించిన ఆరోపణలపై ఐదుగురు వైకాపా ఎమ్మెల్యేలకు ఏపీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, రోజా, సంజీవయ్య, వెంకటగౌడ, రజనీ లాక్‌డౌన్ నిబంధనలు ఉల్లంఘించారని న్యాయవాది పారా కిశోర్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాది ఇంద్రనీల్‌బాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వాదనలు వినిపించారు. అనంతరం ఐదుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసిన ఉన్నత న్యాయస్థానం.. ఎమ్మెల్యేలపై తీసుకున్న చర్యలపై వారంలోగా కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీకి ఆదేశాలు జారీ చేసింది.

## ఏపీలో మద్యం ధరలు మరో 50శాతం పెంపు

**(విన్యూస్, అమరావతి) :** ఆంధ్రప్రదేశ్‌లో కరోనా లాక్‌డౌన్ నేపథ్యంలో దాదాపు 44 రోజుల తర్వాత దుకాణాలు తెరుచుకోవటంతో మద్యం ప్రియులు పోటెత్తారు. దీంతో వారిని అదుపు చేయటం సాధ్యం కాలేదు. మరో వైపు ప్రజల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో అధికార యంత్రాంగం దిద్దుబాటు చర్యలు చేపట్టింది.

ఇందులో భాగంగా మద్యం తాగేవారి సంఖ్యను తగ్గించాలనే ఉద్దేశంతో మద్యం ధరలు మరో 50శాతం పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. మద్యం దుకాణాలు తెరిచే సమయానికే గతంలో




ఉన్న రేట్లకంటే 25శాతం పెంచగా.. ఇప్పుడు అదనంగా మరో 50శాతం మేర పెంచారు. పెరిగిన ధరలు ఇవాళ్టి నుంచే అమల్లోకి రానున్నాయి. ఈ నెలాఖరులోగా 15 శాతం మద్యం దుకాణాలు తగ్గించాలని ఆబ్కారీశాఖ నిర్ణయించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు దుకాణాలు తెరవవద్దని ఏపీ ఎస్‌బీసీఎల్ ఆదేశించినట్లు సమాచారం. ఇప్పటికే మద్యం ధరల సవరణలో అధికారులు నిమగ్నమయ్యారు. దీనిపై కాసేపట్లో అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశముంది. ఇవాళ ఉదయం నుంచే ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా మద్యం దుకాణాలను మూసివేయించారు. తుదపరి ఆదేశాలు వచ్చే వరకు దుకాణాలు తెరవవద్దని సూచించారు.

## మచిలీపట్నంలో మరో 2 పాజిటివ్ కేసులు నమోదు - ఆర్ డివో

**(విన్యూస్, మచిలీపట్నం) :** మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మరో 2 కరోనా పాజిటివ్ కేసులు నిర్ధారించబడ్డాయని బందరు ఆర్ డివో ఎన్ఎస్‌కె ఖాజావలి వెల్లడించారు. మంగళవారం స్దానిక ఆర్ అండ్‌బి అతిథి గృహంలో ఆర్ డివో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ మచిలీపట్నం గాంధీనగర్ లో ఒకే కుటుంబంలో భార్య భర్తల ఇరువురికి పాజిటివ్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ కారణంగా గాంధీనగర్ ఏరియా 4, 6, 9 వార్డులలో కొంత భాగం రెడ్‌జోన్ పరిధిలోకి వస్తాయని కావున ప్రజలు ఎవ్వరు బయటకు రాకూడదని అన్నారు. ఇళ్ల వద్దకే వాహనాలతో పాలు, కూరగాయలు, నిత్యావసర సరుకులు పంపడం జరుగుతుందన్నారు. లక్ష్మీటాకీస్ సెంటర్ , జడ్ పి సెంటర్ల వద్ద మెయిన్ రోడ్లు పూర్తిగా మూసివేయడం జరుగుతుందన్నారు. అత్యవసర విధులు నిర్వర్తించే పోలీసు, వైద్య, మున్సిపల్, రెవిన్యూ సిబ్బందికి మాత్రమే



అనుమతిస్తారన్నారు. పాజిటివ్ నమోదైన వ్యక్తుల ప్రైమరీ, సెకండరీ కాంటాక్టులను గుర్తించి వారికి కరోనా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని నెగిటివ్ వస్తే హోం క్వారంటైన్ చేయడం జరుగుతుందన్నారు. నగరంలో ఒక ఆర్ ఎంపి వైద్యుని వద్ద పాజిటివ్ నమోదైన వ్యక్తులు ట్రీట్‌మెంటు పొందినట్లుగా తెలుస్తున్నదని, కోవిడ్ నిబంధనల ప్రకారం ట్రీట్‌మెంటు ఇచ్చిన వైద్యునిపై కేసు నమోదు చేయడం జరుగుతుందని ఆర్ డివో తెలిపారు. ఈ వైద్యుని దగ్గర ట్రీట్‌మెంటు పొందిన వారు ఎవరైన ఉంటే కరోనా లక్షణాలు కనబడితే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మున్సిపల్ కమీషనర్ ఎస్. శివరామకృష్ణ, డిఎస్‌పి మహబూబ్ బాషా, డా. బాలసుబ్రమణ్యం, తహసిల్దారు సునీల్ బాబు పాల్గొన్నారు.

# ప్రపంచ ఆర్థికానికి మహమ్మారి సవాళ్లు

కొవిడ్ మహమ్మారి యావత్ ప్రపంచాన్నీ మాంద్యంలోకి నెట్టేసింది. అమెరికా వంటి దేశాలను కరోనా వైరస్ ముట్టడి ఆర్థికంగా అతలాకుతలం చేసింది. ప్రపంచ ఆర్థికం కుదేలవుతున్న దశలో కరోనా విరుచుకుపడింది. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలు గాడితప్పి, సామాజిక అశాంతి ప్రబలి, రాజకీయ పార్టీల పట్ల అసంతృప్తి విస్తరిస్తున్న సంధి కాలంలో కరోనా వైరస్ కమ్ముకొంది. ప్రపంచీకరణతో దూరాలు కరిగిపోయాయి. ఇప్పుడు కరోనా వైరస్ విరుచుకుపడి ప్రపంచీకరణ నడ్డివిరిచింది. మరోవంక అంతకంతకూ విస్తరిస్తున్న చైనా సైనిక, ఆర్థిక ప్రాబల్యం అమెరికాను అభద్రతలోకి నెట్టింది. తమ ఉన్నతశ్రేణి సాంకేతిక పరిజ్ఞానం, మేధా సంపత్తి చైనా చేతికి చిక్కకుండా అమెరికకా ఇప్పటికే అన్ని కట్టుదిట్టాలూ చేసుకొంది. చైనాపట్ల తన మిత్ర దేశాలూ అదే పద్ధతిని అనుసరించాలని అమెరికా ఒత్తిడి తెస్తోంది.

ప్రపంచీకరణ, జాతీయవాదాల మధ్య దేన్ని ఎంపిక చేసుకోవాలన్నది ముమ్ముందు పెద్దయెత్తున చర్చనీయాంశమయ్యే అవకాశం ఉంది. కరోనా వైరస్‌ను చైనా సృష్టించిందా లేక అది సహజంగానే ఉద్భవించిందా అనే విషయంలో వివాదం కొనసాగుతూనే ఉంది. వైరస్ పుట్టుకకు కారణమై, ప్రపంచాన్ని కల్లోలంలో ముంచిందన్న ఆరోపణలను మాత్రం చైనా దీర్ఘకాలంపాటు ఎదుర్కోవాల్సి ఉంటుంది. 14 లక్షల కోట్ల డాలర్ల విలువైన చైనా ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా ఉత్పత్తి రంగంపై ఆధారపడి మనుగడ సాగిస్తోంది. ఫ్యాక్టరీలను పునరుజ్జీవింపజేసి, మౌలిక సౌకర్యాలను విస్తరించుకోవడమన్నది అప్పుల్లో కూరుకుపోయిన చైనా ముందు ఇప్పుడున్న అతిపెద్ద సవాలు. 'ఒన్ బెల్ట్ ఒన్ రోడ్', ఆఫ్రికాలో ఖనిజ వనరుల అన్వేషణ పేరిట చైనా ఇప్పటికే వందల కోట్ల డాలర్లు ఖర్చు పెట్టేసింది. ఆ వ్యయం ప్రస్తుతం చైనాకు అతిపెద్ద భారంగా మారింది. స్థూల దేశీయోత్పత్తితో పోలిస్తే అత్యధిక అప్పుల్లో కూరుకుపోయిన దేశం చైనా! ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు భారత్‌కు కొత్త అవకాశాలుగా అక్కరకొస్తాయా అన్నదే ఇప్పుడు చర్చ కొవిడ్ అనంతర నూతన ప్రపంచ ఆర్థిక నిర్మాణంలో చైనా పాత్ర చెప్పుకోదగినదిగా ఉండకపోవచ్చునన్న వాదనలు ఇటీవల ఊపందుకుంటున్నాయి. చైనా నెత్తిన ఉరుముతున్న అప్పులు, కరోనా విషయంలో ఆ దేశ అనుమానాస్పద వైఖరిపట్ల ప్రపంచ దేశాల అసహనం కారణంగా భవిష్యత్తులో 'బీజింగ్' పాత్ర కుంచించుకుపోవచ్చు అన్న మాట వినిపిస్తోంది.

ఇప్పటికే అనేక దేశాలు చైనానుంచి తమ కంపెనీలను ఉపసంహరించుకుంటున్నాయి. చైనాలోని కంపెనీలు తక్షణం ఆ దేశాన్ని వదిలి వెళితే ప్రత్యేక రాయితీలు అందజేస్తామని జపాన్ ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రకటిస్తోంది. తమ దేశానికి చెందిన కీలక కంపెనీలను చైనానుంచి ఇండియాకో మరో చోటికే తరలించాలని అమెరికాఅధ్యక్షుడు పట్టుదలగా ఉన్నారు. కరోనా వైరస్ వ్యవహారంలో చైనా తమకు 20 లక్షల కోట్ల డాలర్లమేర నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ అమెరికా కేసు వేసింది. అమెరికా ట్రెజరీ బాండ్లలో చైనా పెద్దయెత్తున పెట్టుబడులు పెట్టింది. కరోనా నష్టపరిహారంలో భాగంగా ఆ పెట్టుబడులన్నింటినీ అమెరికా స్తంభింపజేసే అవకాశాలు కొట్టిపారేయలేనివి. మరోవంక మౌలిక సౌకర్యాల విస్తరణ కోసం 70 దేశాలను కలుపుతూ బెల్ట్ అండ్ రోడ్ పేరిట ఏడేళ్ల క్రితం చైనా ప్రారంభించిన కార్యక్రమం ఇప్పట్లో ఫలితాలను ఇచ్చే అవకాశాలే లేవు. చైనానుంచి గతంలో పెద్దయెత్తున అప్పులు తీసుకున్న దేశాలు కొవిడ్ అనంతరం ఆర్థికంగా మరింత బలహీనపడి, ఆ రుణాలు తిరిగి చెల్లించలేని పరిస్థితుల్లోకి జారుకోవచ్చు.

చైనా బలహీనతలను భారత్ బలంగా మార్చుకోవాలి. కరోనా కాలంలో ప్రపంచ దేశాలకు హైడ్రాక్సీ క్లోరోక్విన్ సరఫరాతోపాటు, 'సార్క్' దేశాలకు 50 లక్షల డాలర్ల నిధులు సమకూర్చడం వంటివి అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్ఠను పెంచాయి. ఉత్పత్తి రంగంలో భారత్ తనను తాను ఆవిష్కరించుకోవడానికి, 'భారత్‌లో తయారీ' కార్యక్రమానికి కొత్త ఊపిరులూదడానికి ఇదే తగిన తరుణం. నిర్దిష్ట ప్రణాళికలతో ప్రపంచ శ్రేణి కంపెనీలను దేశంలోకి ఆహ్వానించాలి. ఉత్పత్తి రంగంలో భారత్ బలహీనతలనూ ఈ సంక్షోభం బయటపెట్టింది. బల్క్ డ్రగ్ తయారీకి అవసరమైన ముడి వనరుల్లో 60 శాతం ఇప్పటికీ చైనానుంచే దిగుమతి చేసుకోవడం భారత్ బలహీనతకు చిహ్నం. కేంద్ర, రాష్ట్రాలు సంయుక్త వ్యూహంతోబీ కీలక రంగాలకు అవసరమైన రాయితీలు ప్రకటించడం ద్వారా ఈ సమస్యలను పరిష్కరించాలి. కనీవినీ ఎరుగని స్థాయికి పడిపోయిన ముడి చమురు ధరలు భారత్‌కు అందివచ్చిన వరంగా మారాయి! దీనితో రష్యా, అమెరికా, 'ఒపెక్' వంటి చమురు ఉత్పత్తి దేశాల ఆర్థిక వ్యవస్థలు తీవ్రంగా ప్రభావితమవుతాయి. మరోవంక చమురుకోసం అంగలార్చే భారత్, చైనాల ఆర్థిక వ్యవస్థలకూ కొత్త ఊపునిచ్చే పరిణామమిది. అంతర్జాతీయ విపణిలో ముడి చమురు ధరలు కనిష్ఠానికి చేరడంతో- భారత్ చమురు బిల్లు అనూహ్యంగా తగ్గిపోయింది. వందల కోట్ల డాలర్ల డబ్బు దేశానికి ఆదా అవుతోంది. ఈ ధనాన్ని ప్రభుత్వం ఏ రకంగా ఖర్చు చేయబోతోందన్నది 130 కోట్ల భారతీయుల తలరాతను నిర్దేశించనుంది!

# రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**(వి న్యూస్, మచిలీపట్నం) :** రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సిపిఎం పార్టీ కార్యాలయం వద్ద సామాజిక దూరం పాటిస్తూ మౌన సిపిఎం పార్టీనాయకులు దీక్ష పడుతున్నారు. ఈ దీక్షలో ఆవుల బసవయ్య పోలా బత్తిన మోహన్ రావు, వేజెండ్ల శ్రీనివాస రావు, రేపల్లె యోగ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులూ...తాగునీటి ఇబ్బందులు చక్కదిద్దండి !!



**(విన్యూస్, మచిలీపట్నం) :** మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటి ఇబ్బందులు నివారించేందుకు అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేసి నీటి సమస్య ఏర్పడకుండా రాష్ట్ర రవాణా, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పేర్ని వెంకట్రామయ్య ( నాని ) సూచించారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక ఆర్ అండ్ బి అతిధి గృహంలో వివిధ అధికారులతో జరిగిన ప్రత్యేక సమావేశంలో మంత్రి పేర్ని నాని పలు విషయాలపై చర్చించారు. తొలుత ఆయన తాగునీటి సమస్యలపై పలు సూచనలు చేశారు. పట్టణ పరిధిలో అసంపూర్ణంగా ఉన్న రిజర్వాయర్లను మరో 15 రోజులలో పూర్తి చేయాలనీ పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అధికారులకు తెలిపారు . అలాగే రాపిడ్ శాండ్ ఫిల్టర్ల ( ఆర్ ఎస్ ఎఫ్ ) ను వచ్చే గురువారం నుంచి అందుబాటులోనికి వచ్చేలా ఏర్పాట్లు చేయాలన్నారు. వలందపాలెం, ఓగీస్ పేట , రుస్తుంబాద, మాచవరం రిజర్వాయర్లు వర్షాకాలం సమీపించేసరికి గ్రౌండ్ లెవెల్ పనుల నుంచి రిజర్వాయర్ల నిర్మాణం పైకి వేగవంతంగా పూర్తి చేయాలనీ మంత్రి ఆదేశించారు. తాగునీటి దుర్వినియోగం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బందరుకోట, గిలకల'%యౌాఅ%డి ప్రాంతాలలో గతంలో 6 లక్షల లీటర్ల నీటిని ఇచ్చేవారని, ఇపుడు మనం రోజుకు 15 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నట్లు మంత్రి పేర్ని నాని పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మచిలీపట్నం మాజీ జడ్ పి టీ సి సభ్యులు లంకె వెంకటేశ్వరరావు ( ఎల్వీ ఆర్ ), మునిసిపల్ ఏ ఈ సాయి ప్రసాద్, వర ప్రసాద్, పిల్లి ప్రసాద్, గూడవల్లి నాగరాజు, తిరుమలశెట్టి ప్రసాద్, కాగిత జవహర్ ( బున్నీ ), పర్ణం సతీష్, శొంఠి ఫరీద్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యంతో వైకాపా ప్రభుత్వం ఆడుకోవడం అమానుషం పి.వి ఫణికుమార్



**(విన్యూస్, మచిలీపట్నం) :** మద్యం దుకాణాలు తెరిచి ప్రజల రక్తం పిండుకోవడం దారుణం అని తెలుగుదేశం పార్టీ కృష్ణ జిల్లా కార్యదర్శి పి.వి.ఫణి కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మద్యం దుకాణాల వద్ద చేరే గుంపులతో కరోనా మరింత ఉధృతం అయితే దానికి వైసీపీ ప్రభుత్వమే బాధ్యత వహించాలి అన్నారు. మద్యం పై ఆదాయమే ముఖ్యమా? ప్రజల ఆరోగ్యం ముఖ్యమా? అని ప్రభుత్వాని ఫణి కుమార్ ప్రశ్నించారు. మద్యం నిషేదానికి ఇంతకంటే మంచి సమయం ఏ ముంది అన్నారు. ఎన్నికల సమయంలో వైకాపా ప్రభుత్వం మధ్యపాన నిషేదం చేస్తానని మాట తప్పి మద్యం రేట్లు భారీగా పెంచి ప్రజల పై పెను భారం మోపడం ఈ ప్రభుత్వానికి భావ్యమా అన్నారు. ఆదాయం కోసం ప్రజల ఆరోగ్యంతో ఈ వైకాపా ప్రభుత్వం ఆడుకోవడం అమానుషం అన్నారు. జే టాక్స్ వసూలు కోసమే మద్యం అమ్మకాలకు అనుమతులు ఇచ్చారని ఫణి కుమార్ ఆక్షేపించారు. మద్దతు ధరల కోసం రైతులు న్యాయస్థానాలను ఆశ్రయయిచడం వైకాపా ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనం అని అన్నారు. పోలీసుల బందోబస్తు మధ్య మద్యం అమ్మకాలు సాగించాల్సిన దుస్థితి నెలకొనడం విచారకరం అన్నారు.

# 300 మాస్కులు పంపిణీ



**(విన్యూస్, మచిలీపట్నం) :** మచిలీపట్టణం నియోజకవర్గం చిన్నాపురం గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి వర్యులు చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఎన్టీఆర్ ట్రస్ట్ పంపిన 300 మాస్కులను సెంటర్ వద్ద వైద్య సిబ్బంది, ఏఎన్ఎమ్‌లకు మాస్కులు,శానిటైజర్లు మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, రూరల్ తెలుగుదేశం పార్టీ నాయకులు పంపిణీ చేశారు.

# ప్రభుత్వం మద్యం దుకాణాలను తెరవడం చాలా బాధాకరం



**(విన్యూస్, మచిలీపట్నం) :** దేశమంతా కరోనా,కోవిడ్ 19 తో తీవ్రంగా పోరాడుతూ ఉండగా ప్రభుత్వం మద్యం దుకాణాలను తెరవడం చాలా బాధాకరం అని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు లాం తాంతియా కుమారి ఒక ప్రకటన ద్వారా ఖండించారు. పేద, మధ్యతరగతి ప్రజలు ఉపాధి కోల్పోయి 45 రోజులుగా పస్తులు ఉంటుంటే మద్యం దుకాణాలను తెరవడం వల్ల ఇంట్లో సామాన్లు సైతం తాకట్టు పెట్టి మద్యం తాగే ప్రమాదం ఏర్పడిందన్నారు. దీనివల్ల పేద మధ్యతరగతి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఏర్పడింది.భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు ఏర్పడి నానా ఇబ్బందులు రావచ్చని అన్నారు.మధ్యతరగతి వారి చిన్న చిన్న షాపులను తెరిస్తే కరోనా వైరస్ వ్యాప్తి చెందుతుందని చెప్పిన ప్రభుత్వం మద్యం దుకాణాలను తెరిచి కిలోమీటర్ల కొద్దీ భౌతిక దూరం పాటించకుండా వేలాది మంది ఒకే చోట గుమిగూడటం చూస్తే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతా రాహిత్యం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.ఇప్పటికైనా అనాలోచిత నిర్ణయాలు మానుకుని,డబ్బే పరమావధి కాదు.పేదమధ్య తరగతి ప్రజల ప్రాణాలను కాపాడాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు లాం తాంతియా కుమారి ఒక ప్రకటన ద్వారా హెచ్చరించారు.

# నెల్లూరులో సిఐడి ఎస్సై అనుమానస్పద మృతి - కేసు నమోదు చేసిన పోలీసులు



**(విన్యూస్, నెల్లూరు) :** నెల్లూరు సిఐడి విభాగంలో ఎస్సైగా బాధ్యతలు నిర్వహిస్తున్న మాలేపాటి బ్రహ్మానందం అనుమానస్పదంగా మృతి చెందారు. మంగళవారం ఉదయం యూనిఫాం ధరించి విగతజీవిగా ఇంట్లోని బెడ్ రూంలో మంచంపై పడి ఉండగా బంధువులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. నెల్లూరు రూరల్ మండలం, 3వ మైలు వద్ద నివాసం ఉండే బ్రహ్మానందం ప్రస్తుతం లాక్ డౌన్ విధులు నిర్వహిస్తున్నారు. ఆయన భార్య, కుమార్తె అమెరికాలో ఉంటున్నారు. కుమారుడు హైదరాబాద్ లో ఉన్నారు. ప్రస్తుతం ఇంట్లో ఒంటరిగా ఉంటున్న బ్రహ్మానందం మంగళవారం ఉదయం డ్యూటీ వెళ్లేందుకని యూనిఫాం ధరించిన తర్వాత అస్వస్థతకు గురైనట్లు గుర్తించారు. దీనిపై వారి కుటుంబసభ్యులు నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు.

# 4వ డివిజన్‌లో మాస్కులు, చీరలు, దుప్పట్లు పంపిణీ



**(విన్యూస్, మచిలీపట్నం) :** 4వ డివిజన్‌లో పారిశుధ్య కార్మికులకు ఎన్టీఆర్ ట్రస్ట్ పంపిన మాస్కులు, చీరలు దుప్పట్లు మాజీ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అభ్యర్థిని కరెడ్ల సుశీల, ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు గొర్రిపాటి గోపీచంద్, మాజీ జడ్పీటీసీ లంకె నారాయణ ప్రసాద్, మాజీ కౌన్సెలర్ కొట్టే వెంకట్రావు, రమేష్, మండల పార్టీ అధ్యక్షులు కుంచె నాని, మాజీ ప్రభుత్వ ఆసుపత్రి చైర్మన్ తలారి సోమశేఖర్, తెలుగుదేశంపార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రెడ్‌జోన్ పరిధిలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా నిత్యావసరాలు సరఫరా చేయాలని - మంత్రి

**(విన్యూస్, మచిలీపట్నం) :** లాక్‌డౌన్ పటిష్టవంతంగా అమలు చేయాలని కోవిడ్ నివారణకు కృషి చేయాలని రాష్ట్ర రవాణా, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. మంగళవారం స్దానిక ఆర్ అండ్‌బి అతిధి గృహంలో బందరు డివిజన్ కరోనా టాస్క్‌ఫోర్స్ సమావేశం జరిగింది. కరోనా వ్యాప్తి నివారణకు లాక్‌డౌన్ అమలు, రెడ్‌జోన్లలలో ప్రజలకు పాలు, కూరగాయలు, నిత్యావసరాల పంపిణీ తదితర అంశాలపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మచిలీపట్నంలో గాంధీనగర్ ఏరియాలో మరో 2 పాజిటివ్ కేసులు నిర్ధారణ అయిన కారణంగా రెడ్‌జోన్



పరిధి నిర్ణయించడం, చెక్ పోస్టుల ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టాలని, రెడ్‌జోన్‌లో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా పాలు, కూరగాయలు, నిత్యావసర సరుకులు ప్రత్యేక వాహనాల ద్వారా సకాలంలో పంపిణీ గావించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కరోనా పాజిటివ్ కేసులు జిల్లాలో ఎక్కువుగా నమోదు అవుతున్నందున లాక్‌డౌన్ పటిష్టవంతంగా అమలు చేయాలని విజయవాడ నుండి ఇతర ప్రాంతాల నుండి ఎవ్వరూ పట్టణంలోనికి ప్రవేశించకుండా చర్యలు చేపట్టలన్నారు. ఈ సమావేశంలో బందరు ఆర్ డివో ఎన్ఎస్‌కె. ఖాజావలి, మున్సిపల్ కమీషనర్ ఎస్. శివరామకృష్ణ, డిఎస్పి మహబూబ్ బాషా, డా. బాలసుబ్రమణ్యం, డ్వామా పిడి జి.వి. సూర్యనారాయణ, తహసిల్దారు సునీల్ బాబు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్ . అప్పారావు రైతు బజారు ఇవో అమీర్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధికి చెక్కులు అందజేత

**(విన్యూస్, మచిలీపట్నం) :** మచిలీపట్నం 28వ డివిజన్ కి చెందిన చీలి,పావని ముఖ్యమంత్రి సహాయనిధి 5 వేల రూపాయలు చెక్కును మంగళవారం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో రాష్ట్ర రవాణా, సమాచార శాఖ





మంత్రి పేర్ని నానికి అందజేశారు. ఆనంతరం 17 వ డివిజన్ కి చెందిన సిహెచ్ చంద్రశేఖర్ ముఖ్యమంత్రి సహాయనిధి 10,116 రూపాయలు చెక్కును మంగళవారం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో రాష్ట్ర రవాణా, సమాచార శాఖ మంత్రివర్యుల కు అందజేశారు.

# ఎస్ఐ మీద చర్యలు తీసుకోమనడాన్ని ఖండించిన బీసీ సంక్షేమ సంఘం



**(విన్యూస్, మచిలీపట్నం) :** మచిలీపట్నం బీసీ సంక్షేమ సంఘం టౌన్ అధ్యక్షుడైన శేకుబోయిన సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో మచిలీపట్టణం రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మీద చర్యలు తీసుకోమని ప్రముఖులు ఇచ్చిన ఫిర్యాదును ఖండిస్తున్నా ము. నీతి నిజాయితీ గా పనిచేస్తున్న రూరల్ ఎస్ఐ తన విధులు నిర్వహణలో భాగంగా కరగ్రహారం నాటు దొంగసారా వ్యాపారం చేయుచున్న వారి మీద చర్యలు తీసుకునే క్రమములో నాటుసారా విక్రయదారులు మరియు వ్యాపారులు దౌర్జన్యము చేసి, కొందరు ప్రముఖులు చేత ఎస్సై మీద చర్యలు తీసుకోమని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఇలా చట్టవ్యతిరేక వ్యాపారాలు చేసే వారిని ప్రోత్సహించ రాదని. మరియు నీతి నిజాయితీగా పనిచేసే అధికారులుకు బీసీ సంక్షేమ సంఘం ఎల్లప్పుడు అండగా నిలుస్తుందని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో మారగాని రేణు కుమార్, కొండేటి మోహన్, జోగి సర్వేశ్వరరావు, ధనికొండ చిన్ని, తదితర బీసీ నాయకులు, పాల్గొన్నారు.

# కరోనాను కట్టడి, లాక్ డౌన్ అమలులో పూర్తిగా ప్రభుత్వం విఫలం: మంత్రి కొల్లు రవీంద్ర



**(విన్యూస్, మచిలీపట్నం) :** మచిలీపట్నం టీడీపీ కార్యాలయంలో మాజీ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర మంగళవారం ప్రెస్ మీట్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనాను కట్టడి, లాక్ డౌన్ అమలులో పూర్తిగా ప్రభుత్వం విఫలమైంది అన్నారు. సీఎం జగన్ కరోనాను ఓ సాధారణ విషయంగా తీసుకోవడం దురదృష్టకరమన్నారు. కేంద్ర బృందాలు వచ్చి పరిశీలించుకునే పరిస్థితులు తీసుకువచ్చారు,

ఎంత తొక్కి పెట్టాలని చూస్తున్నా కేసులు పెరుగుతూనే ఉన్నాయి అని తెలిపారు. సామాన్యులకు అవసరమైన నిత్యావసర వస్తువులకేమో ఉదయం 6-9గంటలు సమయం ఇచ్చారని, అదే మద్యానికి మాత్రం ఉదయం 11గంటల నుండి రాత్రి 7గంటల వరకు అనుమతి ఇచ్చారన్నారు. ఆంధ్రప్రదేశ్ ను బజారుకీడ్చేస్తున్నారు అని అన్నారు. వైసీపీ నేతలు ప్రచార అర్భాటాలకు పోతూ కరోనా వ్యాప్తికి కారకులుగా మారుతున్నారన్నారు.

జాతీయ స్థాయిలో సీఎం జగన్ విమర్శల పాలవుతున్నారన్నారు. జే టాక్స్ కోసమే రాష్ట్రంలో పనికి మాలిన బ్రాండ్లతో మద్యం అమ్మకాలు అముతున్నారన్నారు. జే టాక్స్ కట్టిన బ్రాండ్లే కౌంటర్లలో దొరుకుతున్నాయి అని, జే టాక్స్ కట్టని కారణంగా ప్రముఖ బ్రాండ్ లన్నింటినీ ఆపివేశారన్నారు. మెడికల్ షాపులకు వెళ్లే వాళ్లని కొడుతున్నారని, కానీ మద్యం షాపుల ముందు భౌతిక దూరం లేకుండా వేల మంది బారులు తీరటం వల్ల కరోనా వ్యాప్తి చెందితే ఎవరు బాధ్యత వహిస్తారన్నారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో మీ వైసీపీ నేతల వల్ల కరోనా వ్యాప్తి చెందింది అన్నారు. ఇప్పుడు మద్యం అమ్మకాల వల్ల, పనికి మాలిన బ్రాండ్లు తాగడం వల్ల జరగరానిది జరిగితే అందుకు సీఎం జగనే బాధ్యత వహించాలి అని పేర్కొన్నారు. కేంద్రం ఇచ్చిన వెయ్యి రూపాయలు, రెండు సార్లు రేషన్ ఇవ్వడం మినహా రాష్ట్ర ప్రభుత్వం చేసిన సాయమేమిటో చెప్పాలన్నారు. అమ్మఒడి మాదిరి మగవారి గొంతు తడి కోసమే మద్యం అమ్మకాలు అన్నారు. పూర్తిగా తాగి పెళ్లాం బిడ్డల్ని కొట్టడం కోసమే ఈ గొంతు తడి మద్యం అమ్మకాల ద్వారా ముగ్గురిని బలి తీసుకున్నారుని, ఆదాయం కోసం నిన్న 25% ధరలు పెంపు, నేడు ఏకంగా 50% పెంపు ధరల పెంపు వల్ల ఆడవారి పుస్తులు తాకట్టు పెట్టి మరీ మద్యం తాగుతున్నారు అని వాపోయారు. సామాన్య ప్రజలను దోచుకోవడమే అజెండాగా ప్రభుత్వం పని చేస్తోంది అన్నారు. మద్యం అమ్మకాలను తక్షణం నిలుపుదల చేయాలి, లేనిపక్షంలో తెలుగుదేశం పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమిస్తుంది అన్నారు.

# బీహార్ నిర్వాసితులకు బియ్యం, సరుకులు పంపిణీ

**(విన్యూస్, పొన్నూరు) :** పొన్నూరు పట్టణానికి బీహార్ నుంచి వలస వచ్చిన కార్మికులకు స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం బియ్యం, గోధుమ పిండి,వుల్లిపాయలు,నూనెలు,ఇతర సరుకులు సరఫరా చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద




జరిగిన ఈ కార్యక్రమంలో కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు వలస కార్మికులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నేతలు ఆర్.భావన్నారాయణ, కొల్లిపర సాంబశివరావు, అమరా నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు లయన్స్ క్లబ్ సేవలను కొనియాడారు.

# కాయగూరలు పంపిణీ

**(విన్యూస్, పొన్నూరు)** : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బొద్దులూరి రాంగారావు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఇతికంపాడు రోడ్డు, ఎస్.టి కాలనీలలో మంగళవారం పేదలకు కాయగూరలు ఉచితంగా పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆశీస్సులతో నిరంతరం లాక్ డౌన్



బాధితులకు పంపిణీ చేస్తున్నట్లు రాంగారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నన్నపనేని అంకినీడు చౌదరి, గెరా సంజీవ్,తదితరులు పాల్గొన్నారు.


## V స్మార్ట్ యాడ్స్

**Insurance**

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అన్ని రకాల వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించబడును. ఇన్సూరెన్స్ చేయించుకోదలచిన వారు సంప్రదించండి: టి.సి.ఎన్ శ్రీనివాస్. 9246761404 08672-221097

**మస్కిటో డోర్స్&విండోస్**

చక్రిన్ మస్కిటోడోర్స్&విండోస్... అల్యూమినియమ్ మస్కిటో డోర్స్&విండోస్ తయారు చేయబడును. మరియు రిపేర్ చేయబడును. సంప్రదించండి: చక్రిన్ మస్కిటోడోర్స్&విండోస్ గొడుగుపేట-మచిలీపట్నం సెల్:9182197822 9121605277

**LOANS**

HOME LOANS BUSINESS LOANS... PLEASE CONTACT: 9399936609

**తక్కువధరకే ప్రకటనలు**

ఇల్లు/స్థలం అమ్మలన్నా, కొనాలన్నా, అద్దెకు ఇవ్వాలన్నా, ఉద్యోగం కావాలన్నా, ఉద్యోగులు కావాలన్నా తక్కువ ధరతో విన్యూస్‌లో ప్రకటన ఇచ్చి నిశ్చింతంగా ఉండండి. మరిన్ని వివరాలకు నంప్ర: 9848667347

**వి స్మార్ట్ యాడ్స్ కేవలం రూ.100/-లకే స్మార్ట్ యాడ్..**

సంప్రదించండి 9848667347

**LOANS**

BUSINESS LOANS MORTIGAGE LOANS CONTACT: 9491624334

**LOANS**

పర్సనల్ లోన్స్, బిజినెస్ లోన్స్, అగ్రికల్చర్ లోన్స్, ఎడ్యుకేషన్ లోన్స్ అన్ని రకాలలోన్స్ 2 రోజుల్లో ఇప్పించబడును. వడ్డీ 50 పైసలు. 1 లక్ష నుంచి 50లక్షల వరకు ఇవ్వబడును. కావల్సిన వారు సంప్రదించండి: 7095129660

**అమ్మబడును**

మచిలీపట్నం శివారు రాడార్ కేంద్రం దగ్గర కళ్యాణీటౌన్‌షిప్‌లో 300గజాల ఫ్లాట్ అమ్మబడును. కావల్సిన వారు సంప్రదించండి: సెల్: 7032931205 సంప్రదించు వేళలు: ఉదయం11 - 2పిఎం


# మద్యం షాపులను మూసివేయాలని డిమాండ్

**(విన్యూస్, మచిలీపట్నం) :** కుల వివక్ష వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో మచిలీపట్నం మగ్గాల కాలనీలో మద్యం షాపులను మూసివేయాలని, వలస కూలీల ను ఆదుకోవాలని, ఎస్‌ఎస్సి గోడౌన్లో ఉన్న ధాన్యాన్ని ప్రజలకు పంచాలని, ప్రతి కుటుంబానికి లాక్‌డౌన్ సందర్భంగా 7,500 నగదు అందజేయాలని, కేరళ తరహా మాదిరిగా ప్రతి కుటుంబానికి 17 రకాల నిత్యావసర సరుకులు ఉచితంగా అందించాలని ధర్నా



నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె. శర్మ, సిహెచ్ రాజేష్, సిఐటియు నాయకులు సిహెచ్ రవి, బూర. సుబ్రహ్మణ్యం, సిహెచ్ జై రావు, ఐద్వా సంఘం నాయకులు సిహెచ్. విజయలక్ష్మి, జి కన్నమ్మ జి శాంత కుమారి అది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వైసీపీ కార్యకర్తకు కత్తి పోట్లు: దుండగులు కోసం అన్వేషణ లో పోలీసులు

**(విన్యూస్, పొన్నూరు) :** స్థానిక నిడుబ్రోలు కు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బ్రహ్మయ్య ను సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేసి పరారైనట్లు పోలీసులు తెలిపారు.



బ్రహ్మయ్య కు తీవ్రంగా గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి నట్లు తెలిపారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బ్రహ్మయ్య ను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పరామర్శించారు. ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆయన తో పాటు పరామర్శించిన వారిలో పార్టీ స్థానిక సీనియర్ నాయకులు వడ్రాణం ప్రసాద రావు,షేక్ నాజర్ తదితరులు ఉన్నారు. పొన్నూరు అర్బన్ సి ఐ ప్రేమయ్య ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దుండగులు కోసం గాలింపు చేపట్టారు.

# మనం ఫౌండేషన్ వారు 400 ఆహార పొట్లాలు పంపిణీ

**(విన్యూస్, పెడన) :** లాక్ డౌన్ మొదలైన నాటి నుండి నిన్నటి వరకు 40 రోజులుగా అనేక మంది పేద ప్రజలకు అనాధలకు ఆహార పొట్లాల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నామని ఆ ఫౌండేషన్ అధ్యక్షుడు మామిళ్ల ఈశ్వర్ కుమార్ అన్నారు ఈ మేరకు మంగళవారం బ్రహ్మపురం తోటమూల కప్పలదొడ్డి పెడన తదితర ప్రాంతాలలో ఉన్న నిరుపేదలకు




ఆహార పొట్లాలు అందించామన్నారు మండేటి ఎండను సైతం లెక్కచేయకుండా తమ సభ్యులు ఎంతో కృషి చేశారని తెలిపారు ఈ కార్యక్రమంలో వెంకటేష్ సింగరాజు సందీప్ రామకృష్ణ టిప్పు పాండురాజు వేదవ్యాస దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కరోనా రాకూడదు అంటే మాస్క్ తప్పనిసరి ఎస్ ఐ చిరంజీవి

**(విన్యూస్, పులివెందుల)** : కరోనా రాకూడదంటే మాస్కు తప్పనిసరిగా ఇంటి నుండి బయటకు వస్తున్న యువతకు, ప్రజలకు ప్రతిరోజూ పోలీసుల పర్యవేక్షణ లో... స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో రోజుకొక వినూత్న పద్దతిలో




అవగాహన కల్పిస్తున్నారు... ఇందులో భాగంగా మంగళవారం... ప్రధాన రహదారుల నుండి బజారుకు వస్తున్న యువతను మోకాళ్ళ పైన కూర్చో బెట్టి, చిన్నపాటి శిక్ష తో... మాస్క్ లు కట్టి... ఇక ఎప్పటికి మాస్క్ లు మరువకూడదు అని ఎస్ ఐ చిరంజీవి హెచ్చరించారు.

ఈ కార్యక్రమం లో కానిస్టేబుల్ లు ఫర్హాన్, భాస్కర్, బాబా, వాలంటీర్ దినేష్, సేవా సమితి అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.

# కరోనా కష్టాలలో కదలివచ్చిన మంచితనం-48వ డివిజన్ బుడగజంగం కాలనీలో 300 కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ

## - అభాగ్యులను ఆదుకోవడమే నిజమైన మానవత్వం

**(విన్యూస్, కడప) :** కడప నగరంలోని బిల్టప్ సమీపంలో బుడగజంగం కాలనీ లో బేడ బుడగజంగం సంక్షేమ సంఘం అధ్యక్షులు ప్రెసిడెంట్ దుద్దుకూరు శ్రీ రాములయ్య తన కుటుంబ సభ్యులు ఈ



కాలనీలోని నిరుపేదలకు బియ్యం, కూరగాయలు, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్ఆర్సిపి నాయకులు రాజారెడ్డి మరియు న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్, సంఘ పెద్దలు దూపం రాజు హాజరై కరోనా మహమ్మారి వల్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నియమించిన లాక్ డౌన్ ను పాటిస్తు వారి వృత్తి బిక్షాటన చిన్న చిన్న వ్యాపారాలు మానుకుని ఇంటిలో, గుడారాలలో నిర్బంధంలో ఉన్న నిరుపేదలకు తమ జాతి ప్రజలు ఆకలితో ఉండకూడదని తన వంతు సాయంగా డి.శ్రీరాములయ్య తన కుటుంబము మానవత్వం చాటుకున్న ఎదుటి మనిషి ఆకలితో ఉండకూడదని ఆహార వస్తువులు బుడగజంగం కాలనీలో 300 కుటుంబాలకు 6 కింటాల బియ్యం, కూరగాయలు నిత్యవసర వస్తువులు ప్రతి పేద కుటుంబానికి పంపిణీ చేసి ఆకలి తీర్చారు. నిరాశలో ఉన్న వారికి తమ స్థోమతకు తగినంతగా తమ జాతి వారిని ఆదుకొని సహాయపడ్డాడు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడుగు బలహీన వర్గమైనా ఈ బుడగజంగాలను ఆదుకోవాడానికి ఇంకా దాతలు ముందుకు వచ్చి ఆకలి తీర్చాలని మరియు వీరు యాచన మానుకున్నారు ఆకలితో వున్నారు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు చిత్తారి రామయ్య, సాయిలు, డి.అందలమ్మ మరియు వాలంటీర్ పి.రవితేజ పాల్గొన్నారు

# రెడ్‌జోన్‌లో ఎల్ఐసి కార్యకలాపాలు ప్రారంభమా?: న్యాయవాది లంకిశెట్టి

**(విన్యూస్, మచిలీపట్నం) :** రెడ్ జోన్ పరిధిలో ఉన్న మచిలీపట్నంలో బుధవారం నుండి పెద్దఎత్తున 200 మంది ఉద్యోగులతో వినియోగదారులతో ఎల్ఐసి డివిజనల్ ఆఫీసు కార్యకలాపాలు ప్రారంభించడం ఎంతవరకు సబబు అని న్యాయవాది బాలాజీ అధికారులను ప్రశ్నించారు. ఎల్ఐసి ప్రహరీ గోడ వెనకాలే ఇటీవల కరోన పాజిటివ్ కేసు నమోదైన విషయం తెలిసి కూడా కిలోమీటర్ పరిధిలో కంటోన్మెంట్ ప్రకటించాలని నిబంధన చెబుతుంటే ప్రభుత్వ నియమ నిబంధనలు తుంగలో తొక్కి రేపటి నుంచి ఎల్ఐసి కార్యాలయంకి రండి అంటూ ఉద్యోగస్తులకు వినియోగదారులకు సమాచారం పంపటం సరైన విషయం కాదని ఆయన పేర్కొన్నారు. తక్షణమే మచిలీపట్నం టాస్క్‌ఫోర్స్ అధికారులు స్పందించాలని, కంటోన్మెంట్ ఏరియాలో జనసమ్మర్ధం ఎక్కువగా ఉండే ఎల్ఐసి వంటి కార్యాలయాలు పని చేయకుండా చూడకపోతే కరోనా మరింత ప్రబలే ప్రమాదం ఉందని బాలాజీ పేర్కొన్నారు. మచిలీపట్నంలో 6 పాజిటివ్ కేసులతో జనం భయబ్రాంతులకు గురి అవుతుంటే ఎల్ఐసి వంటి కార్యాలయాలు తెరవడం సమర్థనీయం కాదన్నారు.



# బట్ట జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ హై స్కూల్ పూర్వ విద్యార్థులు వికలాంగులకు వితరణ

**(విన్యూస్, పెడన) :** కరోనా వైరస్ వల్ల లాక్ డౌన్ నేపథ్యంలో వికలాంగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అందువల్ల వారికి కొన్ని నిత్యావసర సరుకులు పంపిణీ చేశామని జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల లో ఒకరైన మొహమ్మద సిద్దిక్




అన్నారు ఈ మేరకు సిద్ధిక్ మాట్లాడుతూ పట్టణంలో గల జిల్లా పరిషత్ హై స్కూల్ 1986- 87 వ సంవత్సరం పూర్వ విద్యార్థులు అందరూ కలిసి ఆ పాఠశాల వద్ద కొంతమంది దివ్యాంగులకు నిత్యావసరాలు ఉచితంగా అందించామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో హుస్సేన్ బేగ్ బల్ల సుజనా బట్ట జయలక్ష్మి చేవూరి పద్మజ వాహిద్ తదితరులు ఉన్నారు.

# వైయస్సార్ గురువు వెంకటప్ప స్మారకార్థం దివ్యాంగులకు వరప్రసాద్ నిత్యావసరాల వితరణ:

## చిరస్మరణీయుడు వెంకటప్ప వైయస్ మనోహర్ రెడ్డి

**(విన్యూస్, పులివెందుల) :** పులివెందుల ప్రాంతంలో సరైన విద్యా సౌకర్యాలు లేని కాలంలోనే , ఒక మేనేజ్మెంట్ స్కూల్ స్థాపించి ఈ ప్రాంత విద్య ప్రగతికి నాంది పలికిన మహనీయులలో ఒకరైన వెంకటప్ప చిరస్మరణీయుడని, ఆయన శిష్యరికంలో దివంగత నేత డాక్టర్ వైఎస్ఆర్, అంచెలంచెలుగా ఎదిగి ఆదర్శ ముఖ్యమంత్రిగా ఆంధ్ర ప్రదేశ్ ను విద్యాపరంగా దేశంలోనే అత్యున్నత స్థాయిలో నిలిపారని, ఆయన మరణానంతరం తన గురువు చేసిన సేవలను మర్చిపోకుండా పులివెందుల నియోజకవర్గంలో పేద విద్యార్థులకు నాణ్యమైన ఇంగ్లీషు మీడియం ఉచిత విద్యను అందించేందుకు వెంకటప్ప మెమోరియల్ విద్యా సంస్థలను స్థాపించి ఆయన ఋణం తీర్చుకున్నారని, వైకాపా మున్సిపల్ ఇన్చార్జి వైయస్ మనోహర్ రెడ్డి పేర్కొన్నారు.



వైయస్సార్ గురువు వెంకటప్ప 39వ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక ఆర్టీసి బస్టాండ్ సమీపంలో ఏర్పాటుచేసిన గురుశిష్యులు వెంకటప్ప , వైఎస్సార్ విగ్రహాలకు మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి వరప్రసాద్ పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం వరప్రసాద్ సొంత నిధులతో సమకూర్చిన బియ్యం నిత్యావసర సరుకులు 20 మంది దివ్యాంగులకు పంపిణీ చేశారు.

మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి వల్లెపు వరప్రసాద్ మాట్లాడుతూ తమ వంశీకుడైన వెంకటప్ప నేర్పిన విద్య, విలువలు, విశ్వసనీయత ప్రధాన సూత్రాలు గా నేటి సి.యం. జగనన్న అమ్మఒడి, విద్యా దీవేన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్మెంట్ తదితర పథకాలు రూపుదిద్దుకొని విజయవంతమయ్యాయని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథ రెడ్డి,దేవస్థానం చైర్మన్ చెన్నారెడ్డి , కోళ్ల భాస్కర్, బూత్ కమిటీ మేనేజర్ హాల్ గంగాధర్ రెడ్డి, డానియెల్,వెంకటప్ప కుటుంబీకులు గోగుల శ్రీనివాసరాజు, ప్రసాద్, రాజశేఖర్, వడ్డెర సంఘం నాయకులు చంద్రమౌళి,రామరాజు,ప్రశాంత్, YSR.TF ,నాయకులు, C. K. వెంకటనాథ రెడ్డి, బిరుసు బాలు తదితరులు పాల్గొన్నారు.

# నాయి బ్రాహ్మణులకు వరప్రసాద్ నిత్యావసర వస్తువుల వితరణ

**(విన్యూస్, పులివెందుల) :** క్షురకులుగా, ఆయుర్వేద వైద్యులుగా , నాద, సంగీత కళాకారులుగా, త్యాగరాజ స్వామి ఆరాధకులుగా, బహుముఖ ప్రజ్ఞాశాలులుగా సమాజానికి, ఎన్నో రకాల సేవలు అందించిన నాయి బ్రాహ్మణులు, నేడు కుల, చేతి వృత్తుల ఆదరణ కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా కరోనా విపత్కర పరిస్థితులలో ఉపాధి కోల్పోయి ,పనులు లేక ,మూడు పూటలా తిండి దొరకని పరిస్థితుల్లో



ఉన్న నాయి బ్రాహ్మణులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని,పులివెందుల మున్సిపల్ వైకాపా ఇంచార్జి వైయస్ మనోహర్ రెడ్డి పేర్కొన్నారు.

కోవిడ్ 19 , లాక్ డౌన్ కారణంగా ఇబ్బందులు పడుతున్న 110 మందికి పైగా నిరుపేద నాయి బ్రాహ్మణ కుటుంబాలకు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి వల్లెపు వరప్రసాద్, సొంత నిధులతో సమకూర్చిన బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకుల ను, పులివెందుల స్థానిక వెంకటేశ్వర స్వామి గుడిలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో %హా%. మనోహర్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు.

లాక్ డౌన్ కారణంగా గత రెండు నెలలుగా సెలూన్ లు మూతపడి, ఆర్థిక ఇబ్బందుల్లో , అర్ధాకలితో అలమటిస్తున్న నిరుపేద, నాయి బ్రాహ్మణ కుటుంబాలను గుర్తించి ,వారికి పెద్ద ఎత్తున చేయూత నందిస్తున్న వరప్రసాద్, వైయస్ మనోహర్ రెడ్డి గార్లకు నాయి బ్రాహ్మణ సంఘం తరపున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కొండయ్య , లక్ష్మీనారాయణ ,మోహన్ బూత్ కమిటీ కన్వీనర్ హల్ గంగాధర్ రెడ్డి, కోడి రమణ, చంద్రమౌళి, కౌన్సిలర్ అభ్యర్థులు, పార్టీ నాయకులు,కార్యకర్తలు నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# బియ్యం కార్డు లేని నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

**(విన్యూస్, పులివెందుల) :** కోవిడ్ 19 విపత్తు లో కరోనా వైరస్ వ్యాప్తి నివారణకు లాక్ డౌన్ లో ఉండి పనులు లేక జీవనానికి ఇబ్బంది పడుతున్న... బియ్యం కార్డు లేని నిరుపేదలకు... మండి మర్చెంట్స్ అసోసియేషన్ వారి సహకారం తో... స్నేహిత అమృత హస్తం సేవా సమితి ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరుకులు అసోసియేషన్ అధ్యక్షులు మేడా. ఈశ్వరయ్య, కార్యదర్శి. సుధాకర్, సభ్యులు శివ, శ్రీనివాస్, రత్నమయ్య, మనోహర్ బాబు, సేవా సమితి అధ్యక్షులు రాజు ల చేతులమీదుగా మంగళవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో వాలంటీర్ లు అజిత, పవన్ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.0

# ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఇంటి స్థలాల పూడికను పరిశీలించిన ఎమ్మెల్యే



**(విన్యూన్, కలిదిండి) :** ప్రియతమ ముఖ్యమంత్రి జగనన్న రాష్ట్రంలో పేద అక్కచెల్లమ్మలకు ఇచ్చిన మాట మేరకు అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేసుకుంటూ ముందుకెళ్లాలని కైకలూరు శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావు కోరారు. నవరత్నాల అమలులో భాగంగా అర్హులైన ప్రతి పేద అక్కచెల్లమ్మల కుటుంబానికి ఇంటి స్థలం ఇచ్చే దిశగా కైకలూరులో అధికారులు భూసేకరణ ద్వారా సేకరించిన 70 ఎకరాల భూమి పూడిక పనులను ఈ రోజు రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన జగనన్న అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమం ఈ ఇళ్లస్థలాలు ఇచ్చే కార్యక్రమం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 27లక్షల పేదకుటుంబాలకు, అక్కచెల్లమ్మలకు, నిలువ నీడ కల్పించే ఉద్దేశ్యం తో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. పూడిక పనులు సంతృప్తి కరంగా ఉన్నాయని జగనన్న నిర్దేశించిన తేదీనాటికి అక్కచెల్లమ్మలకు అందించే విధంగా అధికారులు ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారితో పాటు, తాహశీల్దార్ ఎం.సూర్యారావు, డీటీ ఉమామహేశ్వరరావు.. ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధికి రూ.౯౦ లక్షలు విరాళం అందించిన మార్కాపురం ఎమ్మెల్యే



**(విన్యూన్, మార్కాపురం) :** కోవిడ్ - 19 నివారణలో భాగంగా సహాయ చర్యల కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి మార్కాపురం ఎమ్మెల్యే కుందూరు నాగార్జున రెడ్డి, నియోజకవర్గ నాయకులు రూ. 90,00,000/- ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో విరాళానికి సంబంధించిన చెక్కును సీఎం వైయస్.జగన్‌కు అందచేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి, ఎమ్మెల్యే కుందూరు నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు, చక్కరకేళి పండ్లు పంపిణీ




**(విన్యూన్, కలిదిండి) :** మానవత సంస్థ సేవలు 38 వరోజు కి జేరినవి. మంగళవారం కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందించిన దాత పోకల నరసింహారావు వీరికి మానవత సంస్థ తరపున ధన్యవాదలు తెలిపారు. దాత సహకారం తో కరోనా లాక్ డౌన్ సందర్భంగా కలిదిండి, కోరుకొల్లు చెక్ పోస్టు, ఆసుపత్రులు, మార్కెట్ యార్డ్, సెంటర్ లోను నిరంతరం సేవలు అందిస్తున్న పోలీస్, వైద్యసిబ్బందికి, వాలంటీర్లు, పారిశుధ్య కార్మికులకు మజ్జిగ ప్యాకెట్స్, చక్కరకేళి పండ్లు ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో మానవత చైర్మన్ పెటేటి వివేకానంద, ప్రత్తి శ్రీనివాసరావు, మారుబోయిన రత్నారావు, కట్టా వెంకట్రామయ్య , చిట్టూరి బాలకృష్ణ, మావులూరి బాబురావు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్యశాలలో టిడిపి నాయకునిపై కత్తితో దాడి



**(విన్యూస్, మాచర్ల) :** స్థానిక 7వ వార్డులో భూ వివాదాలపై అధిపత్య పోరుతో అక్కడి రెండు వర్గాలు పరస్పరదాడులు చేసుకున్నారు. కత్తులతో, కర్రలతోదాడులు, కారం చల్లుకోవటం లాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఫెన్సింగ్ కోసం నెలకోన్న వివాదం ప్రస్తుతం తెరమీదకు వచ్చింది. అయితే అక్కడ భూమి గురించి వీరి మద్య వివాదాలు నడుస్తున్నట్లు సమాచారం. ఈ నేపద్యంలో రెండు వర్గాలు సోమవారం రాత్రి కారం, కర్రలతో ఒక వర్గం, మరో వర్గం కర్రలు గోడ్డలితో దాడులు చేసుకున్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న అర్బన్ సిఐ రాజేశ్వరరావు, ఎస్.ఐలు మోహన్, సంధ్యారాణిలు తమ బృందాలతో అక్కడికి చేరుకుని గుంపులను చేదరగోట్టారు. రెండు వర్గాలు ప్రభుత్వ వైద్యశాలలో ప్రధమ చికిత్స కోరకు వచ్చారు. ఈ దాడులలో గాయపడ్డ బత్తుల ప్రసాదును పరామర్శించేందుకు వచ్చిన 12వ వార్డు మాజీ కౌన్సిలర్ ,తెలుగుదేశం పార్టీ నాయకులు మద్దిగపు చిన వెంకటరామిరెడ్డిపై కత్తితో వైసిపి వర్గానికి చెందిన రవి దాడి చేయగా, వెంకటరామిరెడ్డి చేతికి గాయాలు అయినాయి. దీంతో అక్కడే ఉన్న పోలీసులు స్పందించి అడ్డుకోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది. దీంతో ప్రభుత్వ వైద్యశాలలో కోద్దిసేపు ఉద్రికత్త వాతావారణం నెలకోంది. ఈ ఘర్షణలో వైసిపికి చెందిన రవికి, టిడిపికి చెందిన బత్తుల ప్రసాదుతో పాటు మరి కోందరికి గాయాలు అయినాయి. కత్తిపోటుకు గురైన టిడిపి నేత వెంకటరామిరెడ్డిని ప్రధమ చికిత్స అనంతరం ఇంటికి పంపారు. గాయపడిన రవిని గుంటూరుకు తరలించారు. ఘర్షణలపై కేసులు నమోదు చేసి, 7వ వార్డులో సిఐ రాజేశ్వరరావు స్వయంగా శాంతిభద్రతలను పర్యవేక్షిస్తూన్నారు.

# మనం మారుతున్నామా!

**(విన్యూన్, విజయవాడ) :** పిల్లలను తిట్టడం కొట్టడం బాగా తగ్గిపోయింది. పెళ్ళాల బాధలు మొగుళ్ళకి బాగా అర్ధమవుతున్నాయి మొగుడు పెళ్ళాల మధ్య మందు గొడవలు బాగా తగ్గిపోయాయి. బయట మందుషాపు లేవుగా సంసారం అంటే సరిగ్గా అర్ధం చేసుకొనే అవకాశం మనకు ఇప్పటికి కలిగింది. మొగుడు పెళ్ళాల మధ్య కొత్త ముచ్చట్లు ప్రారంభానికి తెర లేచింది.

ఆ బంధువులు ఈ బంధువులు మన ఇంటికి రావటం లేదుకాబట్టి మొగుడు పెళ్ళాల మధ్య గొడవ బాగా తగ్గింది దాంతో పాటు కుటుంబఖర్చు తగ్గింది.

సినిమాలు షికార్లు రెస్టారెంట్లు షాపింగ్స్ విందులు వినోదాలు ప్రయాణాలు లేక ఆదా అంటే అర్ధమయింది. ఎప్పుడో అటకెక్కిన వైకుంతపాళి, క్యారంస్, చెస్, లూడో వంటి అటలకు ప్రాణం వచ్చింది.

సంసారంలో ఇంత సుఖముందా! అని భార్యాభర్తలు అమ్మానాన్న అంటే స్నేహితులు అంతకు మించి అని పిల్లలు ఆనందించే రోజులు ఇవి.

పెళ్ళైన యాంత్రిక జీవితంలో సంసారం సుఖాన్ని అనుభవించిన దంపతులు స్వచ్ఛమైన ప్రేమ అభిమానలతో సంసారంలో సుఖాన్ని అనుభవిస్తూ జీవితంలో కొత్త పుంతలు తొక్కిస్తున్న ఈ స్వర్గసీమను కలకాలం నిలుపుకోవాలని కోరుతూ



బి. మల్లికార్జున దీక్షిత్
కౌన్సిలింగ్ సైకాలజిస్ట్
చరవాణి 9133320425

# వికలాంగుడికి బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ

**(విన్యూస్, కోడూరు) :** నిరుపేదకు తోడ్పాటు నందించిన టుడే టీవీ క్రైమ్ రిపోర్టర్ కోడూరు మండలం టుడే టీవీ క్రైమ్ రిపోర్టర్ అద్దంకి కృష్ణ ఊటగుండం గ్రామానికి చెందిన వికలాంగుడైన



వెంకటపతికి 20 కిలోల బియ్యం నెల రోజులకు సరిపడ్డ నిత్యావసర సరుకులు కోడూరు ఎస్ఐ రమేష్ గారి చేతుల మీదగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెరిటేజ్ డీలర్ చామర్తి సాయి కుమార్, ఎయిర్టెల్ డీలర్ సురేష్ పాల్గొన్నారు.

# గర్భవతులు, బాలింతలకు పోషకాహారాలు పంపిణీ

**(విన్యూస్, పెడన రూరల్) :** పెడన మండలం ఎస్వీ పల్లి గ్రామం లోని అంగన్వాడీ కేంద్రంలో గర్భవతులు బాలింతలు 6 సంవత్సరాలు లోపు పిల్లలకు పోషకాహారాన్ని అందించారు. 3 కిలోల బియ్యం కిలో



పప్పు అరకిలో నూనె 10 గుడ్లు 2 లీటర్ల పాలు అందించారు. సచివాలయ మహిళా పోలీస్ బీవీ కమలకుమారి అంగన్వాడీ టీచర్ గ్రేస్ తదితరులు పాల్గొన్నారు. ఆరోగ్య సంరక్షణ గురించి అవగాహన కల్పించారు.

# 4 గురు వ్యక్తులు ఆరెస్టు, బోటు సీజ్, 200 లీటర్ల నాటుసారా స్వాదీనం -సిఐ కోండారెడ్డి




**(విన్యూన్, మాచర్ల) :** జెండాపెంటరేవు వద్ద జరిపిన దాడులలో 200లీటర్లు నాటుసారా స్వాదీనం చేసుకుని, 4 గురు వ్యక్తులను ఆరెస్టు చేసి బోటును సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సిఐ కోండారెడ్డి తెలిపారు. ఆయన తన కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ తమకు వచ్చిన సమాచారంతో జెండాపెంటరేవు వద్ద దాడులు చేయగా నాటుసారా తయారు చేసుకుని బోటు ద్వారా రేవు దాటి మన లిమిట్స్‌లోకి రాగానే దాడి చేసినట్లు తెలిపారు.

# స్వామి వివేకానంద సేవా సమితికి క్వింటాల్ బియ్యం

**(విన్యూస్, మాచర్ల) :** ప్రతి రోజు వలసకూలీలు, పేదలు, ఆనాధలకు నిత్యాన్నదాన కార్యక్రమం చేస్తున్న స్వామి వివేకానంద సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డికి మున్సిపల్ పారిశుధ్య కార్మికురాలు శేషా అనసూయమ్మ క్వింటాల్ బియ్యంను మంగళవారం విరాళంగా అందజేశారు. పారిశుధ్య కార్మికురాలు తాము చేస్తున్న సేవలకు



స్పందించటం పట్ల చలించిపోయిన మెట్టు గోవిందరెడ్డి ఆమె కాళ్ళు కడిగి చీర అందజేసి కృతజ్ఞత తెలిపారు. మీ ఇంటి కోస్తే ఏమిస్తావు, మా ఇంటి కోస్తే ఏమి తెస్తావు అన్న చందాన ఉన్న సమాజంలో అనసూయమ్మ స్పందనను పలువురు అభినందించారు. కార్యక్రమంలో మెట్టు రఘురామిరెడ్డి తదితరులు పాల్గోన్నారు.

# ప్రార్ధించే సమయం కాదు ఇది, సహాయం చేసే సమయం ఇది...రెవ.పాష్టర్ కొమ్మూరి బాపనయ్య

**(విన్యూస్, పిడుగురాళ్ల :** పిడుగురాళ్ల పట్టణంలోని కిస్టియన్ పేట మొదటి లైన్లో చల్లగుండ్ల మరియదాసు ఇంటి వద్ద కొమ్మూరి సుబ్బారావు చారిటబుల్ ట్రస్ట్ తరుపున కారంపూడి లూథరన్ సంఘ కాపరి రెవ.పాస్టర్ కొమ్మూరి బాపనయ్య ఆధ్వర్యంలో 20 మంది నిరుపేద కుటుంబాల వారికి నిత్యావసర సరుకులు, 10 కిలోల బియ్యం, కూరగాయలు పంపిణీ చేయటం జరిగింది. ఈసందర్బంగా రెవ.పాస్టర్ బాపనయ్య మాట్లాడుతూ కరోనా వైరస్ లాక్ డౌన్ మూలంగా జీవనం కోల్పోయిన నిరుపేదలను ఆదుకునే సమయం కనుక దేవుని కృపను బట్టి, నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమించు ప్రకారం మాకు వచ్చిన కానుక లతోనే సహాయం చేస్తున్నాను. ప్రార్ధించే సమయంకాదు ఇది సహాయం చేసే సమయం ఇది, పేదలకు సహాయం చేయటం లోనే తృప్తి ఉంటుందిఅన్నారు. ఈ కార్యక్రమంలో చల్లగుండ్ల మరియదాసు, యరమాలచిట్టీ, సల్లూరిచార్లెస్, పణితి కృష్ణ,వాడపల్లి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏలూరు పీఠాధిపతులు జయరావు పొలిమేర ఆదేశాలనుసారం, సెయింట్ తెరిస్సా ఫాదర్ మరియదాసు ఆధ్వర్యంలో పోలీసులకు భోజనం ప్యాకెట్లు పంపిణి




**(విన్యూన్, ఏలూరు) :** ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా మహమ్మారిని అంతం చేయడానికి కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న లాక్ డౌన్ లో భాగంగా అనేకమంది కార్మికులు. శ్రామికులు. నిరుపేద కుటుంబాల వారు. ఆకలితో అలమటిస్తున్న వీధిభిక్షువులు అనేకమంది ఇబ్బందులకు గురవుతున్నా తరుణంలో ఏలూరు పీఠాధిపతులు మోస్ట్ రెవరెండ్ జయరావు పొలిమేర ఆదేశాలనుసారం ఏలూరు సెయింట్ తెరిస్సా ఫ్యారీస్ చర్చి ఫాదర్ మరియదాసు ఆధ్వర్యంలో ఆదివారం సెయింట్ థెరిస్సా చర్చ్ ఆవరణలో సుమారు 75మంది పేద సంఘస్తుల కుటుంబాల వారికి పది కేజీలు బియ్యం. లీటరుఆయిల్ ప్యాకెట్ట్. కేజీ కంది పప్పు. మరియు నిత్యావసర సరుకులను. మరియు గొల్లయిగూడెం తెలుగు బాప్టిస్ట్ పేటకు చెందిన సుమారు75 మంది వితంతు మహిళల కు బియ్యం. ఆయిల్ ప్యాకెట్. కందిపప్పు. నిత్యావసర సరుకులు. అందజేశామన్నారు. దానిలో భాగంగా(కోవిడ్-19) లో భాగంగా మన క్షేమం కోరి అహర్నిశలు అంకిత భావంతో కుటుంబానికి దూరంగా ఉండి. విధులునిర్వహిస్తున్నపోలీసుసిబ్బంది వారికి. ఆరోగ్యశాఖవారికి. పారిశుధ్ధ్య శాఖ వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తు ఆహారం ప్యాకెట్లను అందజేశారు. ఈ కష్ట సమయంలో ఎవరు ఆకలితో ఉండకూడదని తగిన విధంగా శక్తిని ప్రసాదించడానికి మా ఈ చిరు పంపిణీ కార్యక్రమంమన్నరు. మరియు వీధి భిక్షవులకు సుమారు150 మందికి ఆహార ప్యాకెట్ లను. పంపిణీ చేసినట్లు ఫా:మరియాదాసు తెలియజేశారు. ఈ కార్యక్రమం విజయవంతంగా జరిపించడానికి సహాయ సహకారాలు అందించిన దాతలకు మరియు పారిస్ సంఘ పెద్దలకు ఫాదర్ మరియదాసు ప్రత్యేకంగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# మద్యం దుకాణాల వలన కరోనా మరింత ఉధృతం-డాక్టరు యరమల



**(విన్యూన్, మాచర్ల) :** మద్యం అమ్మకాల వలన రాష్ట్రంలో కరోనా వ్యాప్తి మరింత ఉధృతం ఆవుతుందని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ డాక్టరు రామచంద్రారెడ్డి ఆగ్రహం చేశారు. తన కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ మద్యం దుకాణాలు తేరవటం ద్వారా పేదవాడి ప్రాణాలతో వైసిపి ప్రభుత్వం చెలగాటం ఆడుతుందన్నారు. మద్యం దుకాణాల వద్ద బౌతికదూరం పాటించటం లేదు, మాస్కులు ధరించటం లేదన్నారు. చేతులు శుభ్రత పాటించకపోవటం జరుగుతుంద్నారు. లాక్ డౌన్ వలన గడిచిన 6 వారాల నుండి మద్యంకు దూరంగా ఉన్న ప్రజలను తిరిగి మళ్ళి మద్యం దగ్గర చేయటంను నిలదీశారు. మద్యం దుకాణాల అంశంపై మరోసారి ఆలోచన చేయాలని కోరారు. సోనియాగాంధి ఆదేశాల మేరకు వలస కూలీలను కాంగ్రెస్ పార్టీ ఖర్చులతో వారి సోంత గ్రామాలకు పంపుతుందని, వలస కూలీలు రాజీవ్ రతన్ 9959097777, గంగాధర్ 9848334761కు ఫోను చేసి పార్టీ సాయం తీసుకోవాలన్నారు. సమావేశంలో నట్టువ రాధక్రిష్ణ, జివి సత్యనారాయణ, నాగారాజు తదితరులు పాల్గోన్నారు.

# పాత్రికేయులకు నిత్యవసరాలు పంపిణి




**(విన్యూన్, మాచర్ల) :** స్థానిక మదర్‌థెరిసా సేవా సమితి, సెయింట్ ఆన్స్ సిస్టర్స్, రెంటచింతలకు చెందిన డెవలప్‌మెంట్ సోసైటి ఫర్ పూర్ ఆద్వర్యంలో మాచర్ల పట్టణంలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు మంగళవారం నిత్యవసర వస్తువులను పంపిణి చేశారు. తహశీల్ధార్ చినవెంకయ్య పంపిణి కార్యక్రమంను ప్రారంభించారు. ఈ సందర్బంగా తహశీల్ధార్ చినవెంకయ్య మాట్లాడుతూ లాక్ డౌన్ వలన ఇబ్బంది పడుతున్న పాత్రికేయులను ఆదుకునేందుకు మదర్‌థెరిసా సేవా సమితి, సెయింట్ ఆన్స్ సిస్టర్స్, రెంటచింతలకు చెందిన డెవలప్‌మెంట్ సోసైటి ఫర్ పూర్ స్పందించటం అభినందనీయమన్నారు. 5 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, కిలో నూనె, 2 సబ్బులను కిట్‌గా ప్యాక్ చేసి 89 మంది పాత్రికేయుల కుటుంబాలకు పంపిణి చేశారు. కార్యక్రమంలో సోసైటి ఫర్ పూర్ డైరక్టర్ కె రాయపురెడ్డి, మదర్‌థెరిసా సేవా సమితి సభ్యులు జక్కిరెడ్డి మర్రెడ్డి, గాదె కిరీటిరెడ్డి, తుమ్మా మర్రెడ్డి, జక్కిరెడ్డి చిన్నపురెడ్డి, సెయింట్ ఆన్స్ సిస్టర్స్ పుష్పలీల, తోమాసమ్మ, చార్లెస్, పాత్రికేయ సంఘాల నాయకులు, సభ్యులు తదితరులు పాల్గోన్నారు

# స్వగ్రామాలకు వలసకూలీల తరలింపు




**(విన్యూస్, మాచర్ల) :** మాచర్ల పరిసర ప్రాంతంలోని వలస కూలీలను తరలించేందుకు మాచర్ల ఆర్.టి.సి డిపో నుండి 11 బస్సులను ఏర్పాటు చేశారు. సోమవారం ముత్యాలంపాడు గ్రామం నుండి మంత్రాలయం వెళ్ళేందుకు కాలినడకన వస్తున్న వలసకూలీలను మంత్రాలయం తరలించేందుకు 1 బస్సు, తెలంగాణా ప్రాంతం నుండి వచ్చి విజయపురిసౌత్ స్టేట్ చెక్ పోస్టు వద్ద ఉన్న వారిని ఎపిలోని పలు గ్రామాలకు తరలించేందుకు 6బస్సులు, రెంటచింతల మండలంలోని వలసకూలీలను ప్రకాశం జిల్లాకు తరలించేందుకు మరో 4బస్సులను రెవిన్యూ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. 4 నెలల క్రితం ఈ ప్రాంతంకు మిర్చి కోతలకు వచ్చిన వలసకూలీలు లాక్‌డౌన్‌తో ఇక్కడ ఇర్కుపోయినారు. పిల్ల,పాపలతో వారి స్వగ్రామాలకు వెళ్ళే అవకాశం రావటంతో వారి ఆనందాలకు అవధులు లేకుండా పోయినాయి.

# వలసకూలీలకు సిఐటియు, యుటిఎఫ్‌ల సహకారం



**(విన్యూన్, మాచర్ల) :** మాచర్ల మండలం ముత్యాలంపాడు నుండి కర్నూలు జిల్లాకు వెళ్ళేందుకు కాలినడకన బయలుదేరి స్థానిక మార్కెట్‌యార్డులో నిలిచిన వలసకూలీలకు స్థానిక సిఐటియు శాఖ, దుర్గి మండలం యుటిఎఫ్ శాఖల ఆద్వర్యంలో నిత్యవసర సరుకులు పంపిణి చేయటం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు నాయుకుల మహేష్ మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలోని వలసకూలీలందరిని వారి,వారి స్వగ్రామాలకు తరలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు కోటా నాయక్, సిఐటియు నాయకులు శోభన్‌కుమార్, బత్తుల శ్రీను, దుర్గి మండలం యుటిఎఫ్ నాయకులు పాల్గోన్నారు.

Owned by EDITOR and Publisher: PREM NATH THOKALA, 26/152, Buttaipet, Machilipatnam, Krishna Dist.,Printed at Sri Lakshmi Ofset
Printer binders, D.no : 32-26-126/13, opp BSNL Bhavan, Chuttagunta, Vijayawada-4. ph:08672 227347.,cell 9848667347 - RNI NO: APTEL/2015/65279